క్లుప్తంగా

మురుగునీటితో విద్యార్థులకు అవస్థలు



తోట్లవల్లూరు: పాఠశాల గేటు ముందు ఏర్పడిన గొయ్యితో విద్యార్థులు అవస్థలు పడుతున్న ఘటన తోట్లవల్లూరులో వెలుగుచూసింది. స్థానిక మండల పరిషత్ ఆదర్శ పాఠశాల మెయిన్‌గేటు ఎదురుగా మెయిన్‌రోడ్డుపై పెద్ద గొయ్యి ఏర్పడింది. రోజుల తరబడి వర్షం నీరు నిలిచి ఉండటంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. బడి లోపలకు వెళ్లాలంటే మురుగునీటిలో వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి ప్రధాన రహదారిపై ఏర్పడిన గోతులను పూడ్చి ఇబ్బందులు తొలగించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

మురుగునీరు నిల్వలేకుండా చర్యలు



పమిడిముక్కల: తాడంకి గ్రామంలో మురుగునీరు నిల్వలేకుండా, దోమలు వ్యాప్తి చెందకుండా పంచాయతీ చర్యలు చేపట్టింది. మురుగునీరు నిల్వలేకుండా ఉండేందుకు డ్రెయిన్ త్రవ్వకం చేపట్టారు. డ్రెయిన్‌లు శుభ్రం చేశారు. రహదారులకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. సర్పంచ్ జంపాన దనలక్ష్మి, కార్యదర్శి రమణ పనులను పర్యవేక్షించారు.

మెరుగైన విద్యను అందిద్దాం



గుడివాడ టౌన్: నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైనందున విద్యార్థులకు మెరుగైన విద్యను అందిద్దామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఆయన వ్యక్తిగత కార్యాలయంలో గుడివాడ నియోజకవర్గ పరిధిలోని మున్సిపల్, జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలకు కావాల్సిన పాఠ్యపుస్తకాలు వసతి జరిగిందన్నారు. ఉపాధ్యాయుల కొరత ఉందని డీఈవోకు పద్మరాణి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ త్వరలోనే ఉపాధ్యాయుల నియామకం జరుగుతుందన్నారు. మెరుగైన విద్యనందించేందుకు సమిష్టి కృషిచేద్దామన్నారు.

ఘనంగా ఇండియన్ క్రిస్టియన్ డే



పామర్రు: స్థానిక బాట్టవానిపురంలోని విజన్ లైఫ్ సెంటర్‌లో పునీత అపొస్తులు తోమా మరణ దినాన్ని పురస్కరించుకుని ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఇండియన్ క్రిస్టియన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షులు సాల్మన్‌కొల్లాపల్లితుల మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జూలై 3వ తేదీని ఇండియన్ క్రిస్టియన్ డేగా ప్రకటించినట్లు తెలిపారు. అనంతరం అందరికీ క్రిస్టియన్ డే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టి.షాలేం రాజు, ఎం.శామ్యూల్, ఎస్.సాల్మన్‌రాజు, ఎం.చంటిబాబు, వి ఆదామ, జాన్ మోజెస్, సత్యకుమార్ పాల్గొన్నారు.

శానిటేషన్ పనుల పరిశీలన



మండవల్లి: స్థానిక బీసీ కాలనీలో సర్పంచ్ మెండా రూప్స్ శానిటేషన్ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలన్నారు. లేకుంటే అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. ఈ కారణంగా శానిటేషన్ పనులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ పాల్గొన్నారు.

కలుపు నివారణే ప్రధానం

గుడ్లవల్లేరు: నారుమడిలో యాజమాన్యంలో ప్రధానమైనది కలుపు నివారణ అని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రస్తుత తరుణంలో సాగుకోసం విడుదలతో రైతులు నారుమడులు వేసుకునేందుకు సమాయత్తమవుతున్నారు. ఇందుకోసం రైతులకు గుడివాడ వ్యవసాయాధికారి బొలెం అనంతలక్ష్మి ఇస్తున్న సలహాలు ఇవే.

మాగాణి భూముల్లో..

మాగాణి వరిసాగులో నారుమళ్లలో వరితో పాటు సాధారణంగా ఊద ఎక్కువగా వస్తుంది. ఊదతో పాటు బొంత ఊద, ఊర్కంకి, తుండంగి, నక్షత్ర గడ్డి, తుంగ, ఆమడకాయ, పొన్నగంటి కూర, బొక్కెన ఆకు, లూటికాడలు వంటివి వాటి ఆహారం కోసం వరి మొక్కలతో పోటీ పడతాయి. దీంతో వరినారు పెరుగుదలను తగ్గించటమే గాక పురుగులు, తెగుళ్లకు ఆశ్రయమిచ్చి వాటిని నారుమడి నుంచి నాటిన వరి పొలంలోకి వ్యాప్తి చేసి తద్వారా నారును నాశనం చేస్తాయి. నారుమడిలో కలుపును నివారించినట్లయితే నారు ఆరోగ్యంతో పాటు ధృఢంగా పెరుగుతుంది. మరో వైపు నాటే పొలంలోకి కలుపు వ్యాపించకుండా అరికట్టవచ్చు. రైతులు వరి నారుమళ్లను సాధారణంగా రెండు విధాలుగా వేస్తారు. అది దంప నారుమడి, మెట్ట నారుమడి.

నారుమడిలో..

ఈ మడిలో రెండు దశల్లో కలుపును నివారించవచ్చు. విత్తిన మూడు నుంచి ఐదు రోజుల్లో మడిలో నీరు పలుచగా ఉన్నప్పుడు ఎకరం నారుమడికి 35 గ్రాముల ఆక్సాడయార్జిల్ 80 శాతం పొడి మందును మందుగా అర లీటరు నీటిలో కలిపి ఆ ద్రావణాన్ని 20 కిలోల పొడి ఇసుకలో కలిపి పొలంలో సమానంగా చల్లాలి. మందు చల్లిన తర్వాత రెండు రోజుల వరకు నీరు పెట్టనవసరం లేదు. విత్తిన 15వ రోజున పొలంలో కేవలం ఊద మున్నగు గడ్డి జాతి మొక్కలు మాత్రమే ఎక్కువగా ఉంటే ఎకరాకు 400 మిల్లీ లీటర్ల సైహలో ఫాప్ బ్యూటైల్ 10 శాతం ద్రావకం 200 మిల్లీలీటర్ల నీటిలో (అనగా లీటరు నీటికి





నారుమడిలో మందు చల్లుతున్న రైతు (ఇన్‌సెట్లో) ఏఓ అనంతలక్ష్మి

రెండు మిల్లీ లీటర్ల చొప్పున) కలిపి స్ప్రే చేయాలి. ఈ మందు స్ప్రే చేసిన వారం రోజుల్లో ఊద మున్నగు గడ్డి జాతి మొక్కలు మాత్రమే నశిస్తాయి. లేదా నారుమడిలో ఊద మొదలగు గడ్డి జాతి మొక్కలతో పాటు వెడల్పాటి మొక్కలు ఉద్భవించి ఎక్కువగా ఉన్నప్పుడు ఎకరా నారుమడికి 80 మిల్లీలీటర్ల బిస్ పైరిబాక్ సోడియం 10 శాతం ద్రావకం 200 లీటర్ల నీటిలో (అనగా లీటరు నీటికి 0.4 మిల్లీలీటర్ల చొప్పున) కలిపి స్ప్రే చేయాలి. ఈ మందు పిచికారీ చేసిన వారం రోజుల్లో ఊదతో పాటు ఆకుజాతి మొక్కలు నశిస్తాయి.

మెట్ట భూముల్లో..

మెట్టలో నారుమడిలో కలుపు నిర్మూలనకు వరి విత్తనాలు చల్లేటప్పుడు భూమిలో విత్తనాలు మడి మీద కనిపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మడి తడిపిన వెంటనే లేక 2, 3రోజుల్లో ఎకరా నారుమడికి లీటరు పెండిమిథాలిన్ 30శాతం ద్రావకం(లీటరు నీటికి ఐదు మిల్లీలీటర్ల చొప్పున) లేదా ఎకరాకు 400 మిల్లీలీటర్ల ప్రిటిలాక్లోర్ 50 శాతం ద్రావకం(లీటరు నీటికి ఐదు మిల్లీ లీటర్ల చొప్పున) ఏదో ఒక దానిని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మందు స్ప్రే చేసిన రెండు రోజుల వరకు తడి పెట్టరాదు.

నారు మొలిచిన తర్వాత..

నారు మొలిచిన 15వ రోజున నారుమడిలో గడ్డి జాతి మొక్కలు మాత్రమే ఉంటే ఎకరాకు 400 మిల్లీ లీటర్ల సైహలోఫాప్ బ్యూటైల్ 10 శాతం ద్రావకం 200 లీటర్ల నీటిలో(అనగా లీటరు నీటికి రెండు మిల్లీ లీటర్ల చొప్పున) కలిపి స్ప్రే చేయాలి. అయితే గత 6, 7ఏళ్లగా రైతులు ఈ మందును ఊద మొదలగు గడ్డి జాతి మొక్కల నిర్మూలనకు వాడుట వలన కొన్ని ప్రాంతాల్లో ఊద మున్నగు గడ్డి జాతి ఉధృతి తగ్గి వెడల్పాటి మొక్కలు ఎక్కువగా వస్తున్నట్లు కొందరు రైతుల అనుభవం. అటువంటి పరిస్థితుల్లో వరి నారుమడిలో అన్ని రకాల కలుపు మొక్కలు (ప్రత్యేకించి గడ్డి జాతి, వెడల్పాకు మొక్కలు) ఉన్నప్పుడు ఎకరా నారుమడికి 80 మిల్లీలీటర్ల బిస్ పైరిబాక్ సోడియం 10 శాతం ద్రావకం 200 లీటర్ల నీటిలో (అనగా లీటరు నీటికి 0.4 మిల్లీలీటర్ల చొప్పున) కలిపి స్ప్రే చేయాలి. ఈ మందు స్ప్రే చేసిన వారం రోజుల్లో వరికి ఎటువంటి ఇబ్బంది లేకుండా కలుపు నిర్మూలించబడుతుంది.

ఏపీఆర్‌జేసీ అభివృద్ధికి చర్యలు

నిమ్మకూరు(పామర్రు): ఏపీ రెసిడెన్షియల్ గురుకుల కళాశాల, పాఠశాలల అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటామని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మండలంలోని నిమ్మకూరు గ్రామంలోని ఏపీ గురుకుల కళాశాల, పాఠశాలలను ఎమ్మెల్యే బుధవారం పరిశీలించారు. అక్కడి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు మరింత మెరుగైన విద్యాబోధన అందించి కళాశాలను జిల్లాలోనే మొదటి స్థానంలో ఉండేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. నాన్ టీచింగ్ స్టాఫ్‌కు తగువిధమైన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా వండాలన్నారు. నూరుశాతం విద్యార్థులు భోజనం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వండిన పదార్థాలను రుచి చూసి ఎమ్మెల్యే సంతృప్తి చెందారు. కార్యక్రమంలో పామర్రు ఎంఈఓ-2 పద్మావతి, నాయకులు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, వల్లూరిపల్లి గణేష్, డెక్కా వీరాంజనేయులు, అనగాని మురళీ పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

అధునాతన విద్య ఎంతో అవసరం

గుడివాడ టౌన్: మారుతున్న సమాజంలో సాంకేతికంగా అభివృద్ధి చెందిన విద్య ఎంతో అవసరమని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. స్థానిక రాజేంద్రనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆదిత్య డిగ్రీ కళాశాల గుడివాడ శాఖను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదిత్య అధినేత శేషారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కళాశాల్లో డిజిటల్ మార్కెటింగ్‌తో పాటు అనేక రకాలైన కంప్యూటర్ కోర్సులను అందుబాటులోకి తెచ్చారన్నారు. మంచి పరిణామం అన్నారు. కార్యక్రమంలో విశ్వభారతి అధినేత పొట్లూరి శ్రీమన్నారాయణ, శ్రీవిద్య అధినేత ఎస్ రంగారావు, ఏఎన్నార్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఎం. నాగిరెడ్డి, కళాశాల డైరెక్టర్లు బీశెట్టి నాయుడు, ఎస్. సుగుణారెడ్డి, సీహెచ్. రవీంద్రబాబు పాల్గొన్నారు.



ఆదిత్య కళాశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాము

ఎస్వీ రంగారావుకు ఘన నివాళి

కైకలూరు: చలన చిత్ర రంగంలో విశ్వనట చక్రవర్తిగా ఖ్యాతికెక్కిన సామర్ల వెంకటరంగారావు (ఎస్వీ రంగారావు) జయంతి వేడుకలు కైకలూరు-కోరుకొల్లు రోడ్‌లో అభిమానులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎస్వీ రంగారావు కల్చరల్ అండ్ వ్యవస్థాపక అధ్యక్షుడు దుండూరి రంగారావు అధ్యక్షతన ఎస్వీఆర్ ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించారు. కేక్ కట్ చేసి అభిమానులకు అందించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు చలన చిత్రరంగానికి ఎన్టీఆర్, ఏఎన్నార్ రెండు కళ్లయితే ఎస్వీఆర్ గుండె వంటి వారని కొనియాడారు. ఇండోనేషియా ఫిలిం ఫెస్టివల్‌లో అవార్డు పొంది భారతదేశ చలనచిత్రానికే ఆయన వన్నె తెచ్చారన్నారు. నటుడిగా, నిర్మాతగా, రచయితగా బహుముఖ ప్రజ్ఞాపాటవాలను ప్రదర్శించారన్నారు. ఎస్వీఆర్ 1918 జూలై 3న నూజివీడులో జన్మించారని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు నంబూరి హరికృష్ణంరాజు, అభిమానులు సోమల సత్యనారాయణ, భాస్కరరావు, గిరి సత్యనారాయణ పాల్గొన్నారు.



కైకలూరులో ఎస్వీఆర్ జయంతిలో పాల్గొన్న అభిమానులు

ఈకేవైసీని త్వరితగతిన పూర్తి చేయండి

జిల్లా వ్యవసాయాధికారి హబీబ్

మండవల్లి: మండలంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.కె.హబీబ్, సహాయ వ్యవసాయ సహాయకులు జి.వెంకటమణి, మండల వ్యవసాయాధికారి ఎస్ఏ.జిన్నాతో కలిసి పెరికెగూడెం, లింగాల గ్రామాలను బుధవారం సందర్శించారు. పెరికెగూడెం రైతు భరోసా కేంద్రంలో పీఎం కిసాన్, ఈకేవైసీ శాతాన్ని పరిశీలించి, త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం లింగాల రైతు భరోసా కేంద్రం పరిధిలో జీలుగ వేసిన పొలాలు, నారుమడి వేసిన, వెదజల్లిన పొలాలను రైతులతో కలిసి సందర్శించారు. ఆదేవిధంగా ప్రకృతి వ్యవసాయం చేసే రైతులతో కలిసి పెట్టుబడి లేని వరి పొలాలను పరిశీలించారు. మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో మట్టి నమూనాలు సేకరించే ప్రక్రియను, విత్తన డీలర్లను, పురుగుమందుల షాపులను తనిఖీ చేశారు. లింగాల, పెరికెగూడెం రైతులు ఓరుగంటి పోతురాజు, మూరాల జగన్మోహనరావు, పరసా వీరాంజనేయులు, ఉడతా మద్దిరామయ్య, జీవీఎస్ సిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకులు గోపాల్, పద్య పాల్గొన్నారు.



లింగాలలో వరి పొలాలను సందర్శించిన జిల్లా వ్యవసాయాధికారి హబీబ్, ఏడీఏ వెంకటమణి

ఘర్షణలో భార్యాభర్తలకు గాయాలు

ముదినేపల్లి రూరల్: మురుగునీరు రోడ్డు మీదకు రావడంతో ఇద్దరు సమీపుదారుల మధ్య ఏర్పడిన ఘర్షణలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై డి.వెంకటకుమార్ కథనం మేరకు చిగురుకోట గ్రామానికి చెందిన పరసా వెంకటబాలాజీ, తుమ్మా సురేష్ సరిహద్దుదారులు. వీరిలో సురేష్ కుటుంబం వాడిన మురుగు నీరు రోడ్డు మీదకు రావడంతో సురేష్, బాలాజీ కుటుంబ సభ్యులు ఘర్షణ పడ్డారు. ఇదే విషయమై గతంలో ఇరువురికి పలుమార్లు ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో బుధవారం ఉదయం సురేష్ కుటుంబ సభ్యులు వాడిన మురుగునీరు దారిలోకి వదిలిందని బాలాజీ భార్య దేవి సురేష్ భార్య అనిత ఘర్షణ పడ్డారు. ఈ సమయంలో సురేష్, అతని భార్య అనిత చాకుతో బాలాజీతోపాటు అతని భార్య దేవి మీద దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. వీరిని చికిత్స నిమిత్తం గుడివాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించామని తెలిపారు.

పంటభూములను పరిశీలించిన ఆర్డీఓ

కోడూరు: మండలంలో ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న రైతుల పంట భూములను బందరు ఆర్డీఓ ఎం.శ్రీవాణి బుధవారం పరిశీలించారు. కోడూరు-ఉల్లిపాలెం, ఉల్లిపాలెం-హంసలదీవి గ్రామాల మధ్య ఉన్న పంట భూములను ప్లాట్లుగా మార్చేందుకు ల్యాండ్ కన్వర్షన్ అవసరమని రైతులు ఆర్డీఓకు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఈ భూములను ఆర్డీఓ పరిశీలించి, సమీప రైతుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. భూముల్ని సమగ్ర నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ శ్రీనివాసరావును ఆదేశించారు. ఆర్ఐ సుభాషిణి, సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.



రైతులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీవాణి

సీపీఎం నాయకుడు కోటేశ్వరరావు సేవలు ఆదర్శనీయం

పామర్రు: సీపీఎం నాయకుడు బరిగెల కోటేశ్వరరావు చేసిన సేవలను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆ పార్టీ జిల్లా నాయకులు ఆర్సీపీ రెడ్డి అన్నారు. స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు బరిగెల కోటేశ్వరరావు 20వ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో పెరిగిన అరాచక శక్తులను రాజకీయ పార్టీలను ఎదుర్కోవాలంటే కేంద్రంలో ఉన్న బీజేపీపై అందరం కలిసి ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో పామర్రు మండల పరిసర ప్రాంతాల్లో కోటేశ్వరరావు ఉద్యమాలు నిర్వహించి ప్రజలకు అండగా నిలిచారన్నారు. తొలుత బరిగెల కోటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు కోటేశ్వరరావు కుమారుడు బరిగెల భీమేశ్వరరావు, నాయకులు ముళ్లపూడి విల్సన్, కాటూరి నాగభూషణం, చాట్ల రాంబాబు, రామస్వామి, లక్ష్మణరావు, చిన్న ఏడుకొండలు, వెంకట్రావు, దుంపు రఘునాథరావు పాల్గొన్నారు.



కోటేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

9న మండల పరిషత్ సమావేశం

పమిడిముక్కల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 9న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షేక్ మహమ్మద్ సుభాని తెలిపారు. ఎంపీపీ రాపాని దేవసుధ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, సభ్యులందరూ తప్పక హాజరుకావాలని కోరారు.

గుర్తింపు కార్డుల నిబంధనలు సవరించాలి

గుడివాడ టౌన్: కౌలు రైతుల గుర్తింపు కార్డులు ఇచ్చే విషయంలో ఉన్న నిబంధనలను సవరించాలని ఆ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు కోరారు. కౌలురైతు సంఘం నాయకులు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. కౌలురైతు గుర్తింపు కార్డుకు పొలం యజమాని సంతకంతో నిబంధన ఉండటం ఇబ్బందిగా మారిందన్నారు. దీని వలన ప్రభుత్వం నుంచి కౌలు రైతుకు చేరాల్సిన అనేక పథకాలు రైతు నోటికాడ వరకు చేరడం లేదన్నారు. నూతన ప్రభుత్వంలో ఈ విధానం మార్చాలని వారు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కౌలురైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు గంటా అక్కయ్య, లేళ్ల రాంబాబు, నాయకులు బీవీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాలల వార్షిక తనిఖీలు


ముదినేపల్లి రూరల్: విద్యాశాఖ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని పాఠశాలల్లో ఈ నెల వార్షిక తనిఖీలు నిర్వహిస్తామని ఎంఈఓ కె.నరేష్‌కుమార్ తెలిపారు. ఈ నెల 10న గురజ-1 ప్రాథమిక పాఠశాల, 12న జానకిరామపురం ప్రాథమిక పాఠశాల, 15న ముదినేపల్లి ఇండోపాకిస్తాన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, 18న దాకరం ప్రాథమిక పాఠశాల, 22న కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలల్లో వార్షిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. పాఠశాలల రికార్డులు, డైరీలు, పాఠ్య ప్రణాళికలు ఆయా ప్రధానోపాధ్యాయులు అందుబాటులో ఉంచాలని కోరారు.

రాయితీపై వరివిత్తనాల పంపిణీ



కోడూరు: ప్రభుత్వం రాయితీపై అందించే వరివిత్తనాలను బుధవారం రైతులకు పంపిణీ చేశారు. మండలంలోని పిట్టలంక గ్రామ సచివాలయం వద్ద బీపీటీ-5204 రకం వరి విత్తనాలను సర్పంచి కనగాల వెంకటేశ్వరరావు చేతుల మీదుగా అందించారు. కేజీ విత్తనాల ధర రూ.41.80 కాగా సబ్సిడీ పోను రూ.36.80 వంతున రైతులకు అందిస్తున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. 25 కేజీల ప్యాకెట్‌కు రూ.125 సబ్సిడీ వస్తుందన్నారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మెకానిక్స్ డే



ముదినేపల్లిలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లిలో మెకానిక్స్ డే కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక టూ వీలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కొడాలి వినోద్, తహసీల్దార్ ఎస్ఎల్ఎస్ కుమారి పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం వినోద్ మాట్లాడుతూ మెకానిక్‌లంతా ఐకమత్యంగా ఉంటూ వాహనదారులకు నాణ్యమైన సేవలందించాలన్నారు.

ప్లాస్టిక్ సంచుల వాడకం అనర్థం

మండవల్లి: అతిగా ప్లాస్టిక్ సంచుల వాడకం అనర్థదాయకమని ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్.ఎస్.భాస్కరరావు, మండల అధ్యక్షుడు టి.అప్పారావు అన్నారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని బుధవారం ఐక్య వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచుల వల్ల కాలుష్యంతో పాటు మూగ జీవాల ప్రాణాలకు హాని కలుగుతుందన్నారు. ప్లాస్టిక్ సంచుల నిషేధం కొంతమేర అమలు చేసినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేయడం లేదన్నారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ తయారీని ప్రభుత్వం నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. బందారు వెంకయ్య, బండి రంగారావు, హెచ్.ఎం.రంగనాథ్, అంజని, లక్ష్మి, నాగమల్లి, శ్రీదేవి, లావణ్య, విశ్వభారతి హైస్కూలు విద్యార్థులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ సంచుల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉచిత వైద్య సేవలు అభినందనీయం

కైకలూరు: పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆక్వా ట్రేడర్ బూరుబోయిన శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో లోకుమూడి గరువు దర్గాతాలూకాలో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను ఆయన ప్రారంభించారు. శిబిరంలో 436 మందికి వివిధ పరీక్షలు చేశారు. వీరిలో 150 మందికి కంటి పరీక్షలు చేసి 55 మందికి కళ్లజోళ్లు, 30 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. మొత్తం 37 మంది రక్తదానం చేశారు. డాక్టర్లు శివసత్యనారాయణ, దివ్యసరోజ, కృష్ణ, రితీష్, పుల్లేశ్వరరావు, సురేఖ, విద్యాసాగర్, ప్రియాలు సేవలు అందించారు. మానవత సంస్థ అధ్యక్షురాలు కొండ్రెడ్డి చిట్టెమ్మ, సంఘ నాయకులు చినబాబు, పెదబాబు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

పేదలకు అన్నదానం

ప్రముఖ ఆక్వా ట్రేడర్ శ్రీనివాసరావు పుట్టిన రోజు సందర్భంగా ఆయన ఆర్థిక సాయంతో తాలూకా సెంటర్లో అన్న క్యాంటిన్ వద్ద పేదలకు భోజనాలు అందించారు. కూటమి నేతలు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, వేంపాటి విష్ణురావు, కొల్లి బాబీ పాల్గొన్నారు.

ఆక్వా రంగానికి విద్యుత్ లోటు రానివ్వొద్దు

కైకలూరు: నియోజకవర్గంలో ఆక్వారంగంతో పాటు ఎక్కడా కూడా విద్యుత్ సరఫరా సమస్యలు లేకుండా అధికారులు ముందస్తు ప్రణాళికతో వెళ్లాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అధికారులకు సూచించారు. వరహాపట్నంలోని ఆయన నివాసంలో విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. నియోజకవర్గం నాలుగు మండలాల్లో ఎన్ని విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. ఎంత లోడు అవసరం, రానున్న రోజుల్లో ఎన్ని సబ్‌స్టేషన్లు నిర్మించాలి. వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గోపవరంలో ట్రాన్స్‌కో నిర్మిస్తున్న 220 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణంపై ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్యనారాయణ నుంచి వివరాలు అడిగారు. అవసరమైన రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను సరఫరా చేయాలన్నారు. లో-ఓల్టేజీ, విద్యుత్ స్తంభాల కొరత లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కైకలూరు, గుడివాడ రూరల్ విద్యుత్ శాఖ ఏడీలు రామయ్య, దశరథన్, ఏఈలు రవికుమార్, రామకృష్ణ, మూర్తి, జేఈ సత్యనారాయణ, విశ్రాంత విద్యుత్‌శాఖ సీఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనుల బకాయి చెల్లించాలి

చిలకలపూడి(మచిలీపట్నం): ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసిన కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.పవన్‌కుమార్ కోరారు. ఈ మేరకు ఆయన డ్వామా ఏపీడీ ఎ.నాగమహేశ్వరరావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. పవన్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా కార్మికులు గత రెండు నెలలుగా ఎండలో పనిచేయటం జరిగిందన్నారు. ఎనిమిది వారాల బిల్లుల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఆరు మాసాలుగా వ్యవసాయ పనులు లేకపోగా ఒకవైపు ఉపాధి పనులు వేతనాలు చెల్లించకపోవటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై స్పందించి వెంటనే బకాయిలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనుల్లో రాజకీయ జోక్యాన్ని అరికట్టాలన్నారు.